అతడి మొండి మనసు అతడ్ని మరణం వైపుకు నెట్టింది

ఎలుగెత్తి అరవాలని వుంది. గొంతుక చించుకుని చెప్పాలని వుంది.

ఓడిపోతున్న ఆదర్శానికి లొంగి పోతున్న పట్టుదల, తలదించుకున్న ఆశయాలమచూసి జాలిగా నవ్వుకుంటున్న మేధస్సు.

గమ్యం తెలియని బాటసారిలా సాగిపోతున్న కారు దాహం తీర్చుకుందుకు అన్నట్టుగా  ఓ బార్ ముందు ఆగింది.

సుధాంశ చేతిలో బ్రాంది గ్లాసు పట్టుకుని నవ్వుకున్నాడు.

అతడి కిప్పుడు అర్థమయ్యింది. శరత్ దేవదా ఎందుకంత తాగుబోతు అయ్యాడో!

మరచిపోలేని మనసుకు మత్తును అలవాటు చేద్దామనుకున్నాడు పాపం....ఆ మత్తుకు సైతం లొంగని అతడి మొండి మనసు అతడ్ని మరణం వైపుకు నెట్టింది  నిర్దాక్షిణ్యంగా

అంతే!

అదంతే!

మనసు మరీ మొండిదైతే మనిషికి పతనమూ, మరణమూ తప్ప మిగిలేదేముంటుంది?

తాగుబోతు అన్నవాడు హీనుడు కాదు, దీనుడు.

సుధాంశ గ్లాసు పెదవుల కాన్చుకుంటూ కళ్లెత్తిచూశాడు.

అద్దాల కవతలవైపుగా వున్న రోడ్డు. రోడ్డు ప్రక్కనే అప్పుడే. నిలబె డుతున్నారు పదిహేను అడుగులెత్తులో కటవుట్.

సెప్టెంబరు 9న ఉదయం ఆటతో బ్రహ్మాండమైన విడుదల.

సూపర్ హీరోయిన్ వాహిని అత్యద్భుతంగా నటించిన మహోజ్జ్వల చిత్రం శివాజీ ప్రొడక్షన్స్ 'వాహిని.' నిండుగా నిటారుగా నిలబడ్డ వాహిని క్రింద ఓమూలలో ఒదిగి చూస్తున్న సాధన ముఖం.

తళుకులు కుట్టిన అక్షరాలు దీపాల వెలుగులో ధగధగ మంటున్నాయి.
సుధాంశ గట్టిగా కళ్ళు మూసుకుని గ్లాసులోవి ద్రవం గొంతుకలో ఒంపేసుకున్నాడు.

(ఇంకావుంది)







పి.వి.ఆర్. శివకుమార్

[illegible] రఘురాం అండ్ కంపెనీ బాంబే బ్రాంచ్ ఆఫీసులోకి వచ్చిపడ్డాడు పర్చేజ్ ఆఫీసర్ పరమశివం. సరాసరి రిసెప్షనిస్ట్ దగ్గరకు దారితీశాడు.

"ఏదీ లెటర్?" కంగారుగా అడిగాడు.

అతణ్ణి చూస్తూనే విష్‌చేసిన రిసెప్షనిస్ట్, డ్రాయర్లోంచి కవర్ తీసి అందించింది. "పదకొండు గంటలకి కురియర్ సర్వీస్‌లో వచ్చింది సర్. మీ హోటల్‌కి ఫోన్ చేస్తే మీరు బయటకి వెళ్ళారని చెప్పారు" అంది. "అవును. ఇప్పుడే హోటల్‌కి తిరిగి వెళ్ళేసరికి తెలిసింది మీ ఫోన్ వచ్చినట్టు" అనేసి, గబగబ కవర్ చింపాడు పరమశివం. లోపలున్న ఉత్తరం బయటకు లాగాడు. సంతకం చూశాడు. అతని బాస్ రాసిన ఉత్తరం అది. గబ గబ చదివాడు.

"హు......" అనుకున్నాడు.

టూరు ముగించుకుని యీవేళ రాత్రికి తిరుగుప్రయాణం పెట్టుకున్నాడతను. తీరా యిప్పుడీ ఉత్తరం!

ఫాక్టరీలో రెండ్రోజుల్లో డిస్పాచ్ కావల్సిన ఓ పెద్ద మెషిన్ తాలూకు మోటార్, మిషన్ ట్రయల్స్‌లో వుండగా ట్రబులిచ్చి కాలిపోయిందట! వెంటనే బొంబాయిలోనే వున్న ఆ మోటర్ కంపెనీని కల్సి, మరో మోటార్ పంపించమని ఆదేశం!

"హు..... మరో మోటర్! అంత పెద్ద మోటర్ వేరుశనక్కాయల్లా కుప్పపోసుకు కూర్చుంటారా మోటర్ కంపెనీవాళ్ళు? వెంటనే దొరికే అవకాశం మృగ్యం! పోనీ పాతమోటరే తిప్పి పంపి, బాగు చేయించాలన్నా అదంత త్వరగా అయ్యే పనికాదు! ట్రాన్స్‌పోర్ట్‌కే కనీసం నాల్రోజులు పడుతుంది! ఆతర్వాత దాని రిపేర్..... ఖర్మ! తనకిప్పుడప్పుడే వెనక్కి వెళ్ళే యోగం లేదు!......"కసిగా తిట్టుకున్నాడు

కొత్తగా పెళ్ళయి కాపరం పెట్టి ఆరు నెలలవుతున్నా సజావుగా కాపరం మాత్రం మూణ్ణెల్లు కూడా సాగించేందుకు నోచుకోని పరమశివం. ఈ ఆరునెలల్లోనూ నెలకి రెండు, మూడు వారాల చొప్పున టూర్లు తిరిగటమే సరిపోతోంది!

ఎవర్ని తిట్టుకోవాలో తెలీక జుట్టు పీక్కుంటూ సోఫాలో కూలబడ్డాడు. ప్యూన్ని పిల్చి మంచి నీళ్ళు తెప్పించుకుతాగాడు. ఆనక, రిసెప్షనిస్ట్ దగ్గరకు నడిచాడు.



ఆమోటర్ కంపెనీ వాళ్ళ టెలిఫోన్ నంబర్ యిచ్చి, డయల్ చెయ్యమన్నాడు.

పదినిమిషాలు గడిచినా, లోకల్ నంబరే అయినా ఆనంబర్ దొరకలేదు!

ప్రతినిముషం ఓ యుగం లాగగడుస్తోంది పరమశివానికి. వాచి చూసుకున్నాడు పదహారోసారి! నాలుగున్నర కావొస్తుంది.

పోనీ సరాసరి ఆకంపెనీ చేరటానికే వెళ్దామన్నా-నారిమన్ పాయింట్ లోవున్న ఆ కంపెనీ చేరటానికి ఎంత లేదన్నా గంట పడుతుంది అతనున్న ప్రాంతంనించి. టాక్సీలోవెళ్ళినా ట్రాఫిక్ జామ్‌లు తప్పవుకదా!

అందుకే ముందు ఫోన్లో ఆఘోరిస్తే, రేపు ఉదయం స్వయంగా వెళ్ళి ఏడవచ్చు అనుకున్నాడు!

"దొరికింది సార్ లైన్......" అంది రిసెప్షనిస్ట్.

"ఆ........యిలా ఇవ్వండి......" అంటూ ఆతృతగా అందుకున్నాడు. "హలో......అయాం పరమశివం, పర్చేజ్ ఆఫీసర్ ఆఫ్ రఘురాం అండ్‌కో...... మీ సేల్స్ మేనేజర్ నడ్‌కర్ణితో మాట్లాడాలి" అరిచాడు.

"జస్ట్ మినిట్ ప్లీజ్" అంది అవతలి కంఠం. ఆగాడు పరమశివం. నిమిషం గడిచాక అవతలికంఠం అంది మళ్ళీ, "ప్లీజ్ హోల్డ్‌ది లైన్. నడ్‌కర్ణి వేరే లైన్లో ట్రంక్ కాల్ మాట్లాడుతున్నారు."

"ఓ.కె.... నేను లైన్లో వుంటాను" అన్నాడు. 'సదరు నడ్‌కర్ణి ఆఫీసులోనే దొరకటం ఓ శుభసూచకం. వాడు ఊళ్ళో లేడంటే అదో చావయ్యేది' అనుకుంటూ.

'అయినా తమప్లాంట్ వాళ్ళననాలి! ఆ మోటర్ కొని రెండునెలలయింది! మెషిన్ తయారుకాలేదని ట్రయల్స్ తీసుకోలేదు! యిప్పుడు పీకలమీదికి వచ్చింది. మెషిన్ సకాలంలో సప్లయ్ చెయ్యకపోతే ఆర్డర్ కాన్సిల్ చేస్తామంటున్నాడు కస్టమర్! ఇరవై లక్షల మెషిన్! ఆర్డర్ కాన్సిలయితే గోవిందా!

చివరి నిమిషంలో యిలా పర్చేజ్ పీకకి చుట్టుకుంటాయి ప్రాబ్లమ్స్! వంద హార్స్ పవర్ మోటర్..... ఒక్క నిమిషంలో దొరుకుతుందా మనకి తగ్గ





స్పెసిఫికేషన్స్‌తో కొత్తది? ఛ. ..ఛ... వెధవ ఉద్యోగం......వెధవ బతుకు'

అప్పుడే అయిదు నిమిషాలయిపో వటంతో స్వగతం లోంచి స్పృహలో కొచ్చారు పరమశివం.

'ఇంకా రాడే యీ నడ్‌కర్ణి లైన్లోకి?'

"హలో.... హలో...." గట్టిగా అరిచాడు. ఉలిక్కిపడి, వింతగా చూసింది రిసెప్షనిస్ట్ పట్టించుకోలేదతను.

"హల్లో....." మళ్ళీ అరిచాడు.

"హలో......ప్లీజ్ వెయిట్......ఆయన ఇంకా ఆ ట్రంకాల్ అటెండవుతున్నారు......" అంది అవతలి కంఠం.

"ట్రాష్..... ఎంతసేపు వెయిట్ చెయ్యాలినేను? చెప్పండతనితో రఘురాం అండ్‌కో పర్చేజ్ ఆఫీసర్నని....." అరిచాడు!

"ఒ.కె......ఒ.కె...... జస్ట్ ఎమినిట్....."

నాన్సెన్స్..... అనుకున్నాడు పరమశివం. ఎంత నిర్లక్ష్యం ఆవెధవకి? ఏడాదికి అరవై డెబ్బై లక్షల ఖరీదు చేసే మోటర్స్ కొంటాడు తనువాళ్ళ కంపెనీ నించి! తను లైన్లో వుంటే! వెంటనే మాట్లాడకుండా ఇంతసేపు వెయిట్ చేయిస్తాడా!

ఒళ్ళు మండుతోందతనికి! ఫోన్ పెట్టేద్దామా అనుకున్నాడు.

'కానీ.....వెధవది...... ప్రస్తుతం అవసరం తనది! చచ్చినట్టు వెయిట్ చెయ్యాలి! రానియ్ వెధవని లైన్లోకి. కడిగి పారేస్తాను! పై ఏడాదినించీ వేరే కంపెనీకి మార్చేస్తాను ఆర్డర్స్ అంటే. సరి..... వణికి చస్తాడు!'

కసిగా తిట్టుకున్నాడు.

"హల్లో...." మళ్ళీ అరిచాడు, "లైన్లోకి వస్తున్నాడా, ఫోన్ పెట్టెయ్యమంటారా?"

"వస్తున్నారు సర్.... అయిపోయింది ట్రంకాల్. జస్ట్ హోల్డ్.... హలో యస్..... స్పీకాన్..." అంది అవతలి కంఠం.

"హలో........యస్.........నడ్‌కర్ణి హియర్..." నడ్‌కర్ణి గొంతు వినబడింది. అగ్గి బరాటాలా పేలాడు పరమశివం. "నడ్‌కర్ణీ... పరమశివం హియర్! ఎంతసేపు వెయిట్ చెయ్యాలి లైన్లో నేను? పదినిమిషాలనించి లైను పట్టుకు వేలాడుతున్నాను! మీకు నాతో మాట్లాడేందుకు తీరిక చిక్కలేదు! సబ్ స్టాండర్డ్ మోటర్స్ సప్లయ్ చేసి మా ప్రాణాలు తీస్తున్నారు! కనీసం ఫోన్లో కూడా మాట్లాడే తీరిక వుండట్లేదా? మీకసలు మా కంపెనీ బిజినెస్‌లో ఇంట్రస్ట్ వుందా లేదా? లెటజ్ బి ఫ్రాంక్...... ఇలాగైతే నేను మీతో డీలింగ్స్ కంటిన్యూ చెయ్యలేను....." గడగడ అన్నాడు....

"సారీసర్! ఎక్స్క్యూజ్‌మీ.... నేను అవతలి లైన్లో ట్రంకాల్‌తో బిజీగా వున్నాను...."

"అయితే మాత్రం? ప్రయారిటీస్ అక్కర్లేదా?"

"నో...నో... అదికాదు సర్.... అవతల ట్రంకాల్లో మీ పర్చేజ్ మేనేజర్ సుందర్రావుగారు మాట్లాడుతున్నారు! మా మోటర్లో ఏదో ట్రబుల్ వచ్చిందిట కదా! ఆయన డిటెయిల్స్ యిస్తుంటే నోట్ చేసుకుంటున్నాను. మధ్యలో మీ ఫోన్ వచ్చిందని నాకు తెలీదు- ఎవరిదో లోకల్ కాల్ అనుకున్నాను. సుందర్రావుగారు ఫోన్ మధ్యలో ఎలా అవను చెప్పండి...." ఉలిక్కిపడ్డాడు పరమశివం- ఆ ట్రంకాల్ తనటాప్‌దేనా! చచ్చాం! అనుకున్నాడు.

"ఆహా......అలాగా....." గాలితీసిన బెలూన్ లాగా అయిపోతూ అన్నాడు, ఓ.కె. ఏమంటారిప్పుడు మరి? వివరాలు తెలిశాయిగా! అందుకే నేనూ ఫోన్ చేశాను...."

"నోప్రాబ్లమ్ సర్, ఇప్పుడే మా ప్లాంట్‌ని కన్సల్ట్ చేస్తాను. కొత్త మోటర్స్ తయారీలో వున్నాయోమో తెల్సుకొని రేపు మీకు చెప్తాను. రేపుదయమే మీకు ఫోన్ చేస్తాను. అయాం వెరీ సారీ ఫర్‌ది ట్రబుల్..."

మండే వెత్తిన చన్నీళ్ళు పడ్డట్టు అయింది పరమశివం పరిస్థితి!

"ఓ.కె.... ఓ.కె....." అన్నాడు నీరసంగా, ఉద్రేకమంతా చల్లారిపోగా!

